# "నిర్ణయం"

– డా॥ శాంతినారాయణ

లోకం ఇంతదారుణంగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు సీతాలక్ష్మి. లోకులు ఏమనుకున్నా తనకు బాధలేదు కానీ ఇంట్లో చెల్లెళ్లూ తమ్ముళ్లూ చివరికి కన్న తండ్రి కూడా తాను చేసే పని వల్ల కుటుంబ గౌరవం మంట గలిసి పోయిందని నిందించడం భరించలేక పోయింది సీతాలక్ష్మి.

లోకానికేం, ఎవర్నయినా ఆడిపోసు కుంటుంది. కానీ ఒకరి బతుకులోని సాదక బాదకాలను గురించి అదెప్పుడయినా పట్టించు కుందా? సంస్కారం లేని వాళ్ళు మాత్రమే లోకం మాటలు నమ్మి ముందూ వెనకా ఆలోచించకుండా అర్థంలేని భీకరాలకు పోయి పచ్చని తమ సంసారాల్లో నిప్పులు పోసు కుంటారు.

సీతాలక్ష్మి కుటుంబంలో సరిగ్గా అదే జరగడంతో ఆమె హృదయం కాలిపోయింది. నిజానికి కొన్నాళ్ళ నుండి తోడబుట్టిన వాళ్ళ ఎత్తి పొడుపు మాటలతో ఆమె కొవ్వొత్తి లాగా కాలి కరుగుతూనే వుంది. అయితే ఆ వెలుతురు లేకుంటే ఆ ఇంట్లో అంతా చీకటే.

'ఈరోజు వ్యాపారం బాగా జరిగిందట కదక్కా!'

'నీ బైపాస్ రోడ్డు హోటల్ మగవాళ్ళతో ఎప్పుడూ కళకళలాడుతూ వుంటుందట, నిజమేనా సీతక్కా?'

'మనం సరే అనాలేగానీ మన సీతమ్మ రేపు మధ్యాహ్నానికే ఆ హోటల్ని బార్‌గా మార్చుమంటే మార్చగలదర్రా'

తన ఇంట్లోనే వినిపించే ఈ వెటకారపు మాటల్ని మొదట పెద్దగా పట్టించుకోలేదు సీతాలక్ష్మి. ఆమెకు గత జీవితంలోని వేదన తెలుసు. అందుకే తోడ బుట్టిన వాళ్ళ మాటల్ని నవ్వుతూనే కొట్టివేసింది. ఎవ్వరేమనుకున్నా తానుఅనుసరించే మార్గం చెడ్డది కాదనుకుంది. తన చదువుకూ తన స్తోమతకూ తానెంచుకున్న మార్గం కంటే మంచిది మరేదీ ఆమెకు తోచలేదు. అందుకే తాను చేసే పనిపట్ల తృప్తిని పెంచుకుంది సీతాలక్ష్మి. సంసారాన్ని పోషించడమే కాకుండా తానిష్టపడి మరికొన్ని బాధ్యతలను కూడా నెత్తిన వేసుకుందామె. చెల్లెళ్ళ బతుకు తన మాదిరి కారాదనుకుంది. తనకు నలభై యేళ్ళ వయసు పైబడుతున్నా తన బతుకు అడవిగాసిన వెన్నెల అయిందన్న బాధయితే ఆమెకు అసలే లేదు. ఇంతకు ముందయితే అందరి మాదిరే తానూ వయసుకు తగినట్లు సహజంగా పసిడి కలలు కనింది. కాలం గడిచే కొద్దీ కల, కలగానే మిగిలి పోతు న్నందుకు బాధ పడింది సీతాలక్ష్మి. అయితే వయసు పైబడుతున్న కారణంగా జీవితం అర్థమయ్యేకొద్దీ మనసును గట్టి చేసుకొని ప్రతి విషయాన్నీ తేలికగా తీసుకోసాగింది.

అహల్య రాయిగా మారడానికి వెనక మగవాని నీతి బాహ్యమయిన దుర్మార్గాలు కారణమయితే సీతాలక్ష్మి జీవితం బండబారి పోడానికి ఆమె పేదరికం కంటే అర్థం లేని లోక వ్యవహారమే కారణం. అట్లని ఆమె తన జీవితాన్ని అర్థ రహితం చేసుకోలేదు. తానే ఒక మగవాడై బాధ్యతను గుర్తించి చిదికిపోతున్న సంసారాన్ని నిలబెట్టింది. తోడ బుట్టిన వాళ్ళనే కడుపున పుట్టిన వాళ్ళుగా భావించింది. చదువులు మానేసిన ఇద్దరు చెల్లెళ్ళనీ కుట్టు మిషన్ సెంటర్‌కు పంపింది. టైలరింగ్‌లో వాళ్ళు కొంచెం మెలకువ చూపడంతో కష్టపడి రెండు కుట్టుమిషన్లు తెప్పించి ఇచ్చింది.

టైలరింగ్ వృత్తి తనకు కులధర్మం కాదనిసీతాలక్ష్మికితెలుసు. అయితే బతకడానికి ఏ కులం వాళ్ళయినా ఏ వృత్తినయినా చేయవచ్చుననేది ఆమె అభిప్రాయం. అందుకే తన గ్రామస్థులు చాలా మంది పెదవి విరుస్తున్నా లెక్కచేయకుండా తానెంచుకున్న మార్గంలో నడిచింది సీతాలక్ష్మి. ఇంతకూ ఆమె ఎంచుకున్న మార్గమేమిటి? ఆ మార్గాన్నే ఆమె ఎందుకు ఎన్నుకుంది? ఈ ప్రశ్నలు ఆమె గత జీవితాన్ని జ్ఞప్తికి తెస్తాయి .............

సీతాలక్ష్మి రంగనాధ శర్మకు మొదటి సంతానం. రంగనాధ శర్మ తాత ముత్తాతలు బాగా బతికిన వాళ్ళే. ఒక రకమయిన ఆస్తి పాస్తులున్నా పౌరోహిత్యం వల్ల పేరు ప్రతిష్ఠలతో పాటు సుఖజీవితాన్ని సాధించుకొన్న బ్రాహ్మణ కుటుంబం వాళ్ళది. అనంతపురం టౌన్ పక్కనే ఉన్న రుద్రం పేట శోత్రియం దార్ల రంగనాధ శర్మ పూర్వీకులు. ఆచారాలకూ సాంప్రదాయా లకూ పేరు మోసిన వంశం వాళ్ళది. జీవితం కంటే పూజలూ పునస్కారాలే ఆ వంశానికి ఇష్టమయిన అంశాలు. ఇంగ్లీషు చదువులూ ప్రభుత్వ ఉద్యోగాలూ జనంలో తిరగడాలూ అంటరాని వాళ్ళ స్పర్శలూ వాళ్ళకు నచ్చవు.

రంగనాధ శర్మ తాత రఘునాథ శర్మ వేద విజ్ఞానంలో దిట్ట. గొప్ప ఆధ్యాత్మిక వాది. జీవితం, నీటి మీది బుడగ వంటిదనీ రేపటిని గురించి ఆలోచన అవసరం లేదనీ భగవంతుని సేవలో తరించడమే జీవిత ధ్యేయమనీ భావించే వాళ్ళలో మొదటివాడు రఘునాధ శర్మ. రుద్రంపేట ఊరి మధ్యలో వెలసిన నరసింహ స్వామి సాక్షాత్తూ కలియుగ రక్షకుడయిన నారాయణుడని తలంచి కుంకుమాభిషేకం క్షీరాభిషేకాలతో సేవిస్తూ తన జీవితం ధన్య మయిందని తృప్తి పడే వాడాయన. వర్షం పడక పోడానికీ కరువు కాటకాలకూ దేవుణ్ణి విస్మ రించడం, కులధర్మాన్ని పాటించకపోవడం, పూర్వాచారాలను వదలి వేయడం, వర్ణ సాంకర్యం, ఇంగ్లీషు వాళ్ళ విజ్ఞానం మొద లయినవన్నీ కారణాలని గట్టిగా నమ్మే వాడు రఘునాధ శర్మ. అందుకే తన పిల్లలకు ఎవరికీ




ఇంగ్లీషు చదువులు చెప్పించ లేదాయన.

తరతరాలుగా హక్కు అనుభవంలో ఉన్న శ్రోత్రియ భూములు వర్షం లేక బీడు భూములుగా మారిపోవడం, నమ్ముకున్న దేవాలయం ఆదాయం లేక కళా విహీనమవడం రఘునాథ శర్మ కళ్ళముందే సహజంగా జరిగిపోయిన విషయాలు. కాలపరిణామాన్ని అడ్డుకునే శక్తి లేక నిర్లిప్తంగా చూస్తూ కూర్చున్న ఆయన వారసత్వాన్ని ఆయన కుమారుడు, అంటే మన రంగనాథశర్మ తండ్రి విశ్వనాథ శర్మ స్వీకరించాడు. కళ తగ్గిపోతున్న తన సంసారం కంటే జీర్ణమయిపోతున్న భగవంతుని మందిరం ముఖ్యమయిందని తండ్రిలాగానే తనూ అనుకున్నాడు విశ్వనాథశర్మ. చలనం లేని రాతి విగ్రహానికి నిలువ నీడ వుంటే మనుషులందరికీ నీడ లభిస్తుందనుకున్నాడు. కొన్ని శ్రోత్రియం భూములమ్మి దేవాలయాన్ని పునరుద్ధరించాడు. ఈలోగా పట్టణంలో మురికివాడల దగ్గరున్న కూలీనాలీ జనమంతా సంఘంగా ఏర్పడి మిగిలిన ఆ శ్రోత్రియం భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. అది భరించలేని విశ్వనాథ శర్మ తన పరువూ ప్రతిష్ఠా పోయినంతగా బాధపడ్డాడు. తనకూ తన దేవునికీ ఉపయోగపడని భూమికోసం వ్యాజ్యమాడాడు. వేలు వేలు ఖర్చు పెట్టాడు. సమాజంలో కలుగుతున్న మార్పుల్ని తనకున్న పరిజ్ఞానంతో అప్పుడప్పుడే గమనిస్తున్న ఆయన మనవరాలు సీతాలక్ష్మి తన తాత ప్రయత్నాలను అడ్డుకుంది. సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఒక ఆడది తనకు ఎదురు చెప్పడం భరించలేకపోయాడు విశ్వనాథ శర్మ. పట్నంలో ఇంగ్లీషు చదువులు చదువుకొని వుంటే ఇంకెంత ఎదురించి మాట్లాడేదో అని ఆమె జోక్యాన్ని సహించ లేక పోయాడు. కరడుగట్టిన కుటుంబ సాంప్రదాయాలనూ దుర్భరమయిన మగవాని అహంకారాన్నీ సీతాలక్ష్మి ఆపలేకపోయింది.


విశ్వనాధశర్మ, పేదలు గుడిసెలు వేసుకున్న భూమి దక్కించుకోడానికి రాజకీయం కూడా చేశాడు. పట్టణంలోని పేద బ్రాహ్మణులకు ఆ భూమిపైన ఆశలు రేపి బ్రాహ్మణ సంఘాలను రంగంలోకి దించాడు. ఎన్ని చేసినా అతని ప్రయత్నాలు మున్సిపాలిటీ మురికి గుంతల్లో కలిసిపోయాయి. చివరికి ఆ గుంతల్లోని బురద తనమీద చల్లుకోకుండా తప్పలేదతనికి. ఆ బురదంతా కడిగి తండ్రి నుండి వారసత్వాన్ని మన రంగనాధ శర్మ తన చేతుల్లోకి తీసుకునే నాటికి ఆయనకు మిగిలింది ఒక వైపు గోడలు కూలిపోతున్న లంకంత ఇల్లూ, ఇంటినిండా గంపెడు సంతానం, పక్కనే దేవాలయంలో తలుపులు మూసుకుని భద్రంగా కూర్చున్న రాతి విగ్రహం మాత్రమే.

రంగనాధ శర్మ కుటుంబ బాధ్యతలు చేపట్టే సమయానికి సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆచారాలూ సాంప్రదాయాలూ ప్యాషన్‌గా తయారవ సాగాయి. పౌరోహిత్యం తప్పా తన పూర్వీకుల వైదిక విజ్ఞాన వారసత్వాన్ని సంపూర్ణంగా అందుకోలేని రంగనాధశర్మ కూలిపోతున్న సాంప్రదాయ పునాదుల మీద నిలబడడానికే ప్రయత్నించాడు కానీ, పరిణామ మార్గాలను గమనించ లేకపోయాడు. వంశానుగతంగా వొస్తున్న పద్ధతుల్ని వొదులుకోలేకా, కళ్ళముందు వేగంగా సాగిపోతున్న జీవన సరళిలో కలిసి పోలేకా, తరతరాలుగా సుఖాలకు అలవాటుపడిన జీవితాన్ని అదుపు చేసుకోలేకా విలవిలలాడిపోయాడు రంగనాధశర్మ. కనిపించే కాలం వెంట నడవకుండా వెనకటి కాలం కోసం ఎదురు చూస్తున్న రంగనాధ శర్మ ఇంటి ముందు చివరికి ఉమ్మెత్తపూలచెట్లు మొలవసాగాయి. నెర్రెలిచ్చిన ఇంటి గోడలపైన సీమజాలి చెట్లు పెరగసాగాయి. చవుడు తేలిన ఇంటి కప్పుమీద ఉప్పుగడ్డి, పూలు పూయసాగింది. ఆచారాల గోడల వెనుక ఆ ఇంటిమానం చినిగిన గుడ్డపేలికల దాపున సిగ్గుతో కుంచిందుకుపోసాగింది. కమ్మనయిన రుచులకు అలవాటుపడిన ఆ ఇంటి నాలుకలు రుచులను మరిచిపోయిన ఆకలితో అలమటించసాగాయి. అప్పుడో ఇప్పుడో ఆ సంసారం వీధిన పడడానికి సిద్ధంగా ఉంది.

పరిస్థితులన్నీ గమనించిన సీతాలక్ష్మి దిగులు పడుతూ కూర్చోలేకపోయింది. అన్నీ ఆలోచన చేసి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆ నిర్ణయానికి రాకముందే నాలుగిళ్ళల్లో పాచిపనులు చెయ్యడానికి కూడా సిద్ధపడింది సీతాలక్ష్మి. అయితే ఆ వూర్లోగానీ దరిదాపుల్లోగానీ బ్రాహ్మణ కుటుంబాలేవీ లేవు. చేసేది పాచిపని అయినప్పుడు ఏ ఇంట్లో పనయినా ఒకటే అనుకుందామె. తానైతే అనుకుందిగానీ 'బ్రాహ్మణులతో పాచిపనులు చేయించుకోవడమా? ఎంత పాపం?" అని దగ్గరే వున్న కాలనీ వాళ్ళెవరూ అందుకు వొప్పుకోలేదు. రుద్రంపేటలో అయితే ఆ విషయం వినడానికే బాధపడ్డారు. బాధపడ్డారే కానీ ఆదుకున్న నాధుడెవడూ లేడు.

అవును, ఎవడయినా ఎందుకు ఆదుకుంటాడు? ఎవని జీవితం వానిది. ఒకణ్ణి మరొకడు ఆదుకునే స్థితిలో ఈ సమాజం వుందా? పక్కింట్లో ఎవడున్నాడో పట్టించుకొని ఈ జనారణ్యంలో ఒకరు మరొకర్ని ఆదుకుంటారనేది వొట్టి భ్రమే అవుతుంది. అందులోనూ ఎవరో చేసిన మోసం వల్లనో, ప్రకృతి వైపరీత్యం కారణంగానో చెడిపోయిన సంసారమనుకుందామా అంటే అదీ కాకపోయె. కారణాలేమిటో గమనించకుండా చెడిపోతున్న వాళ్ళందర్నీ ఆదుకోడానికి లోకులు దాన కర్ణులేమీ కాదు. అయితే ఆ వూరి సర్పంచ్ మల్లారెడ్డి మాత్రం సీతాలక్ష్మి కుటుంబంపైన జాలికనబరిచాడు.

కుటుంబాన్ని ఎట్లా ఆదుకోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న సీతాలక్ష్మి చివరికి మల్లారెడ్డిని ఆశ్రయించింది. మల్లారెడ్డి చాలా ఆప్యాయతగా సీతాలక్ష్మిని పలకరించాడు. ఆమె కుటుంబ పరిస్థితులను ప్రస్తావించి బాధపడ్డాడు. ఆ ఇంటి గౌరవ ప్రతిష్ఠను గురించి పొగిడాడు. సీతాలక్ష్మి గుణగణాలను ప్రశంసించాడు. ప్రేమాభిమానాలను వొలకబోశాడు. అతనిలో ఎంతో ఆత్మీయత కనిపించడంతో ఆమె మూగదైపోయింది. ఏవేవో జ్ఞాపకాలు మనసులో మెదిలాయేమో కన్నీళ్ళు నింపుకుంది. మల్లారెడ్డి దగ్గరికొచ్చి ఆమె కన్నీళ్ళను తుడిచాడు. అతని స్పర్శను ఆమె ఊహించలేకపోయింది. అతడు మరింత దగ్గరి కొచ్చి ఆమె చుబుకమంటి పైకెత్తి నీతో పనులు చేయించుకోడానికి మనసు అంగీకరిస్తుందా సీతాలక్ష్మీ ! అందలమెక్కవలసిన దానివి, ఇట్లా పరుల సహాయం కోసం దేవురిస్తున్నా వంటే భరించలేకుండా వున్నాను. నువ్వు అంగీకరిస్తే ఏ పనీ చెయ్యకుండా నా ఇంట్లోనే ఉండవచ్చు. నీ కుటుంబం వాళ్ళకూ కాలం గడిచిపోతుంది. అంటూ అతడు మెల్లగా సీతాలక్ష్మి చెయ్యి పట్టుకున్నాడు. హఠాత్తుగా జరిగిన ఆ సంఘటనకు ఆమె విస్తుపోతూ అతని చేతుల్లోనుంచీ తన చేతిని మెల్లగా విడిపించుకొని, బాధావేదనా కోపమూ అన్నీ కలగలిపిన చూపులతో అతని ముఖంలోకి చూసింది. పెదవులు మునిపళ్ళ కింద ఎన్నో రూపాలుగా మారిపోసాగాయి. మనసులో ఏవో అగ్ని పర్వతాలు బద్దలయ్యాయి. పొంగివొస్తున్న



దుఃఖాన్ని మూతికి అడ్డంగా పెట్టుకున్న చీర కొంగుతో ఆపలేక చటుక్కున వెనుదిరిగి అతడు పిలుస్తున్నా వినిపించుకోకుండా బిరబిరా వెళ్ళిపోయింది సీతాలక్ష్మి.

విషయం తెలుసుకున్న సీతాలక్ష్మి తల్లి దండ్రులు బాధపడ్డారు. ధనవంతుడయిన మల్లారెడ్డిని మందలించే ధైర్యంలేక నిందించారు. అది అతని తప్పుకాదని సీతాలక్ష్మి కంట తడిపెట్టింది. అర్థం లేని తండ్రి ఆచారాలే తమ కుటుంబాన్ని అన్యాయం చేశాయని బాధ పడింది.

సీతాలక్ష్మి, ఆ తర్వాత చాలా సార్లు ఆ సంఘటనను గుర్తు చేసుకుంది. మల్లారెడ్డి ఆమెను మళ్ళీ కన్నెత్తి చూడలేదు. అతని మంచి తనం ఆమెకు తెలుసు. అయినా తాను అతని కోరికను మన్నించడానికి సిద్ధంగా లేదు. లోకం మాటలు పట్టించుకోక పోయినా దాని వల్ల ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. పైగా మగవాణ్ణి నమ్మడం, అందులోనూ పేదరికంతో సహాయం కోసం దగ్గరికి వెళ్ళిన ఆడదాని మీద ప్రేమ వొలకబోసే వాణ్ణి నమ్మడం మంచిది కాదు.

ఎన్నో ఆలోచనలతో కాలం బరువుగా ముందుకు పోసాగింది. రోజులు మరింత గడ్డుగా మారిపోసాగాయి. ఇంట్లో పూట గడవడం కష్టమై పోయింది. మట్టి పనికో బేల్దారి పనికో పోతే బాగుండుననుకుంది సీతాలక్ష్మి. పూలమ్మిన చోటనే కట్టెలమ్మడం అనేది ఆమెకు కొంచెం కష్టమనిపించినా ఆ పని తన చాత కాదను కుంది. చాతకానప్పుడు, పని చెయ్య నప్పుడు ఎవరైనా ఎందుకు కూలిస్తారని ప్రశ్నించు కుందామె. ఆ వూరొదలి ఎక్కడికయినా వెళ్ళిపోవడమనేది కూడా అంత సులభమయిన విషయం కాదనుకుంది. పోనీ నలుగురు స్కూలు పిల్లల్ని గుంపేసుకుని 'ప్రయివేటు' చెప్పుదామనుకుంటే కూడా సాధ్యపడలేదు. కనీసం హైస్కూల్ చదువయినా లేని తన దగ్గరికి ఏ తల్లిదండ్రులయినా తమ పిల్లల్ని ఎందుకు ట్యూషన్‌కు పంపుతారు ?

చివరికి ఒక నిర్ణయానికి కొచ్చింది సీతాలక్ష్మి. బైపాస్ రోడ్డు పక్కన చిన్న హోటల్ పెడితే బాగుంటుందనుకుంది. బైపాస్ రోడ్లో వాహనాలు తిరగడం మొదలవగానే మస్తాన్‌వలి టీకొట్టూ, మంగలి రాముడు సెలూన్ బంకూ పెట్టారు. జాఫర్ సాబ్ గాలి మిషన్ వేశాడు. మారెప్ప చెప్పులు కుట్టే పనికోసం పందిరి వేసుకున్నాడు. బోయ రంగమ్మ భారీగా షోడాషాపు పెట్టింది. వాళ్ళందరూ రుద్రంపేట వాళ్ళే. అక్కడ నాలుగు రోడ్ల కూడలి ఏర్పడడంతో, టౌను చాలా దగ్గరవడం వల్ల, కొత్తగా కాలనీలు ఏర్పడడం మూలంగా సాయంకాలం దాకా బాగా రద్దీగానే వుంటుంది. బంకులన్నీ గిరాకీ గానే వుంటాయి.

సీతాలక్ష్మి రంగమ్మ సహాయంతో ఆమె షోడాషాపు దగ్గరనే హోటల్ పెట్టింది. తన ఈడుదయి, చదువూ సంధ్యలు లేని రంగమ్మే షోడాషాపు పెట్టి మగవాని మాదిరి నడుపుకుంటున్నప్పుడు తనకేం తక్కువనుకుంది సీతాలక్ష్మి. సాటి ఆడది బజార్లో వ్యాపారం చేసి బతుకుతున్నప్పుడు అడ్డం రాని కులం, తనకే ఎందుకు అడ్డం రావాలని ప్రశ్నించుకుంది. తనకు తానే జవాబు కూడా చెప్పుకుని కాలానికీ సమాజానికీ భయపడకుండా ఇంటి పరువు వీధిన పడకుండా చూసుకుందామె.

------ గతంలోకి తొంగి చూస్తే ఆకలితో కన్నీళ్ళతో పరుచుకున్న సీతాలక్ష్మి విషాద జీవితం కళ్ళముందు కదులుతుంది. వెతల బురదలో నుంచి పుట్టి పరిమళిస్తున్న ఎర్రతామరలాగా ఆమె రూపం మెదులుతుంది.

అందరినోళ్ళలోనూ నానిన సీతాలక్ష్మి హోటల్ ఇప్పుడు నిండుగా కళకళలాడుతూ వుంది. నలుగురు పని మనుషుల్ని పెట్టుకొని ఆమె ఒంటరిగానే హోటల్ నడుపుకుంటూ వున్నది. తమ్ముళ్ళు వయసుకొస్తున్నా, వాళ్ళ సహాయం తన వ్యాపారానికి ఎంతో అవసరమని తెలిసినా ఆమె ఎప్పుడూ వాళ్ళ సహకారాన్ని కోరలేదు. కోరుకున్నా వాళ్ళు తన దగ్గరికొచ్చి తన కష్టాన్ని పంచుకుంటారన్న నమ్మకం ఆమెకు లేదు. అయినా వాళ్ళ పట్ల తన బాధ్యతను ఆమె నెరవేర్చసాగింది. చదువుకుంటే వాళ్ళు ప్రయోజకులవుతారని కాలేజీలో చేర్పించింది.

రోజులు తృప్తిగానే గడిచిపోతున్నాయి. కానీ సీతాలక్ష్మి మనసు దిగులు పడుతూనే వుంది. చెల్లెళ్ళకు పెళ్ళి సంబంధాలు ఏవీ రావడం లేదు. వాళ్ళలో రోజు రోజుకూ ఏదో అసంతృప్తి పేరుకుంటున్నట్లు వాళ్ళ మాటల్లో నిట్టూర్పుల్లో సీతాలక్ష్మి గమనిస్తూనే వుంది. అయితే తానేం చేయగలుగుతుంది? చదువూ అందమూ హోదా అన్నీ వుండీ లక్షలు లక్షలు పోసినా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కుదరని ఈ పరిస్థితుల్లో తన చెల్లెళ్ళ బతుకులు కూడా తన మాదిరే తయారవుతాయేమోనని ఆమె భయ పడసాగింది. భయపడుతూనే పెళ్ళి సంబంధాల కోసం ప్రయత్నించసాగింది. తాను హోటల్ నడుపుతున్నట్లు తెలిస్తే చాదస్తపు బ్రాహ్మణులు మరో విధంగా అనుకుంటారేమోనని, అసలు, సంబంధాలే వస్తాయో రావోనని అనుమాన పడింది. తాను బయట పడకుండా మధ్యవర్తుల ద్వారా ప్రయత్నాలు చేయించింది. చివరికి ఒక సంబంధం దాదాపు ఖాయమయ్యేలా చూసింది. అబ్బాయికి చదువూ ఉద్యోగం లేకపోయినా బతికే మార్గముందని తృప్తి పడింది సీతాలక్ష్మి. త్వరలో పెద్ద చెల్లెలు పద్మావతి ఒకింటిదై పోతుందని సంబరపడింది. చిన్న చెల్లెలికి కొంతకాలం ఆగి మరింత మంచి సంబంధం తెచ్చి పెళ్ళి చెయ్యవచ్చునని ఆశపడింది.

ఇంట్లో తల్లిదండ్రులూ తమ్ముళ్ళూ అందరూ తను తెచ్చిన పెళ్ళి సంబంధం పట్ల ఇష్టం చూపడంతో సీతాలక్ష్మి సంతోష పడింది. అయితే ఆ సంతోషం భగ్నమై తన్నింతగా వేదిస్తుందని అనుకోలేదామె. లోకులు మరీ అంత సంకుచితంగా ఉంటారని ఊహించ లేదామె. తన వాళ్ళయిన వాళ్ళే ఇంత దుర్మార్గంగా మాట్లాడుతారని అనుకోలేదు సీతాలక్ష్మి. ఇంకా నిన్నటి సంఘటన ఆమె కళ్ళముందు మెదులుతూనే వుంది.

నిన్న ఉదయం అబ్బాయివైపు వాళ్ళు పెళ్ళి నిశ్చితార్థానికి వస్తున్నట్లు చెప్పి పంపారు. వాళ్ళు వచ్చినప్పుడు తాను ఇంట్లో వుండడం మంచిది కాదనుకుంది. శుభ కార్యాలకు తాను అనర్హురాలేమీ కాదు. కుటుంబ పోషణకు తాను ఎంచుకున్న మార్గం కూడా నీచమైందేమీ కాదు. కానీ లోకులకూ ఇంట్లో వాళ్ళకూ అది నచ్చలేదు. అందుకే తమ్ముళ్ళ సూచన తన మనసును గాయం చేస్తున్నా ఆ సమయంలో తాను దూరంగా ఉండడమే మంచిదనుకుంది

సీతాలక్ష్మి.

పెళ్ళికొడుకు వాళ్ళు వచ్చి వెళ్ళి పోయారని తెలియగానే సీతాలక్ష్మి హోటల్ మూసివేసి అదుర్దాగా ఇల్లు చేరుకుంది. ఇంట్లో ఒక్కొక్కరు ఒక్కోచోట నేలమీద మౌనంగా కూర్చున్నారు. వంటగది వాకిలి పంచను ఆనుకొని కారిపోతున్న కన్నీళ్లను తుడుచుకునే ఓపిక లేక చీరచెంగును నోట్లో దోపుకుని పొగిలిపోతూవుంది కన్నతల్లి మీనాక్షమ్మ. ఆమె పక్కనే అటు వైపు తిరిగి మోకాళ్ళ మధ్యలో తలనిరికించుకుని నిశ్శబ్దంగా ఏడుస్తూ వుంది పద్మావతి. కన్న తండ్రి రంగనాథ శర్మ నులక మంచమ్మీద తలాంచుకొని దిగులుగా కూర్చున్నాడు. తమ్ముళ్ళిద్దరూ చెరొక స్తంభానికి ఆనుకొని బరువుగా నిట్టూర్పులు విడుస్తున్నారు.

గడపలోపల అడుగు పెట్టి ఇల్లంతా గమనించి కంపించి పోయింది సీతాలక్ష్మి. ఆమెకు పరిస్థితి అర్థమయింది. నోట్లో తేమ ఆరుకుపోతూ వుంటే తొందర తొందరగా తల్లి దగ్గరికి వెళ్ళి 'ఏం జరిగిందమ్మా' అంటూ ఆదుర్దాగా అడిగింది.

'జరిగేదేముందమ్మా, ఖాయమవు తుందనుకున్న సంబంధం జారిపోయింది' అంటూ బాధగా చెప్పింది మీనాక్షమ్మ.

'ఏమన్నారమ్మా? వాళ్ళు అడిగినవన్నీ ఇస్తామన్నాం కదా ! మన సంబంధం అన్ని విధాలా తమకు నచ్చిందని మధ్యవర్తి నాగరాజా రావుద్వారా చెప్పి పంపినారే. ఇంతలోనే ఏమయిందని?' తడబడుతున్న గొంతుతో గట్టిగా అడిగింది సీతాలక్ష్మి.

'నువ్వు శనిలాగా ఈ కొంపలో వున్నంత వరకూ ఆడ పిల్లలకే కాదు, మాకు కూడా పెళ్ళి కాదే'

'ఈ కొంపకు వంశగౌరవమనేది ఒకటుంటే కదా. సిగ్గూ యెగ్గూ లేక ఆడదానివి నువ్వు బరితెగించి బజార్లో హోటల్ పెట్టి కులుకుతూ వుంటే ఈ ఇంటికి సంబంధం కోసం మర్యాదస్తులు ఎవరయినా వస్తారా?' అంటూ తమ్ముళ్ళిద్దరూ విరుచుకు పడ్డారు. హోటల్ పేరుతో ఏమేమి వ్యవహారాలు సాగిస్తున్నావో అని రాగాలు తీశారు.

'పౌరోహిత్యం చేసుకుంటూ గౌరవంగా బతికే వంశం మనది. మన బ్రాహ్మణ కులంలో ఏ ఆడదయినా రోడ్డమీద నీమాదిరి సిగ్గూ యెగ్గూ లేకుండా దోశెలు వేసి అమ్మడం చూశావా? ఆ రోజే ఈ పని మనకు తగదని ఎంతో చెప్పాను. ఆడదానివి, సంపాదన కోసం బజార్లో పడితే నలుగురూ ఏమనుకుంటారో ఇపుడర్థమైందా? కుటుంబ గౌరవం నాశనం చేస్తివిగదే పాపిష్టిదానా. పరువుపోయి నాక నీ సంపాదన ఉంటేనేం, ఊడితేనేం' అంటూ తండ్రి అసహ్యించుకున్నాడు.

'నలుగురు పిల్లలకు ట్యూషన్లు చెప్పి బతుకుదాం లేక్కా. ముందు నువ్వు ఆ హోటల్ మానెయ్' అని చిన్న చెల్లెలు బాధతోనే సౌమ్యంగా చెప్పింది. అందరి మాటలూ విన్న కన్న తల్లి హృదయం ఎంతగా కాలిపోయిందో యేమో గొంతు విప్పింది. 'దాని సంపాదనతోనే అందరమూ కడుపు నింపుకుంటున్నాం. వాళ్ళెవరో పనికి మాలిన వాళ్ళయితే ఆపిల్లను ఆడిపోసుకోవడం దేనికీ? అంత పౌరుషమున్న మగవాళ్ళయితే కులధర్మంలోనే నడిచి సంపాదించండి. అది ఈ కొంపలో పుట్టిన పాపానికి తన బతుకును బండజేసుకొని మీ కోసం బతుకుతూ వుంది. మీ వంశగౌరవాలకు ఆటంక మయినా ఆపిల్ల హోటల్ నడపబట్టే మీ బతుకులు తెల్లవారుతుండాయి' అంటూ బాధగా ఆక్రోశించింది మీనాక్షమ్మ.

అందరి నోళ్ళకూ ఎవరో తాళాలు వేశారేమో కొంచెం సేపు ఇంటినిండా నిశ్శబ్దం ఆవరించుకుంది. క్రమంగా చీకటి దానికి తోడయింది. ఆ పూట ఆ ఇంట్లో ఎవరూ మెతుకు మింగలేదు. ఆ సంసారంలో ముసురు కుంటున్న చీకటిని పారదోలే శక్తిలేనట్లు దీపాలు ఆరిపోయాయి. అందరూ ఎవరి జాగాల్లో వాళ్ళు పండుకున్నారు. సీతాలక్ష్మి హాల్లో ఒక మూల చాపమీద వెల్లకిలా పండుకొని చీకట్లో కని పించని దృశ్యాల వైపు చూస్తూ వుంది. ఆమె శరీరమంతటా అగ్ని గోళం మండుతూ వుంది. ఆ ఆలోచనలు సూదుల్లా హృదయానికి గుచ్చు కుంటున్నాయి.

'తాను అగౌరవమయిన పని యేదీ చేయలేదు. తాను చేస్తున్న పని మగవాడు చేస్తే వీళ్ళకెవరో అభ్యంతరముండదేమో! బతుకు దెరువు కోసం మగవాడు చేసే పనికి అడ్డం రాని కులం, ఆడది చేస్తే అడ్డం రావడమేమిటి? ఏ కష్టమూ చెయ్యనీకుండా ఈ మగ ప్రపంచం ఆడదాన్ని అంత సున్నితంగా పెంచాలను కుంటూ వుందా? అదేం కాదు, ఆడది సంపాదిస్తే కుటుంబ వ్యవహారమంతా దాని చేతుల మీద జరుగుతుంది. మగవానికి డబ్బు విషయంలో స్వేచ్ఛ వుండదు. అది మగవానికి ఇష్టం కాదు

ఆడది తన సంపాదనంతా మగవాని చేతికిచ్చి అతని చెప్పు కింద తేలులాగా పడివుంటే ఏ విధంగా సంపాదించావని మగవాడు ఆడదాన్ని అడగడు. నిర్లక్ష్యంగా తిరుగుతున్న తమ్ముళ్ళను కట్టుదిట్టం చెయ్యడం వల్లనే వాళ్ళకు తాను చేస్తున్న పని నచ్చలేదు. నచ్చినప్పుడు ఏదో ఒకపని చేసి కుటుంబాన్ని పోషించవచ్చు కదా! తనకు బజార్లో హోటల్ పెట్టుకోవడం ఆనందదాయక మేమీ కాదే. వాళ్ళు ముందు కొచ్చి హోటల్ నడుపుతామంటే తాను కాదనిందా? సిగ్గులేక ఆడదాని దాపున బతుకుతూ తోడబుట్టినదన్న జ్ఞానమయినా లేకుండా ఆడదానిపైన నిందలు వేయడం మగవానికే చెల్లుతూ వుంది. తనకు పెళ్ళిచెయ్యడానికి ఈ సంసారానికి శక్తి లేకపోయినా తాను కోరుకుని వుంటే మల్లారెడ్డో మరొకడో తనను కాదనేవాడా? కానీ ఎందుకో తన జీవితం ఇట్లే గడిచిపోవాలని తానే కోరుకుంది. తాను బతికి అంతకన్నా చేయ గలిగింది యేముందని తల్లిదండ్రులూ తోడ బుట్టిన వాళ్ళకంటే ఆత్మీయులు తనకెవరున్నా రనుకొని తనది కాని బాధ్యతను మీదేసు కున్నందుకు తనకు దక్కిందేమిటి?

కన్న తండ్రికి తన సంసారం ఆకలితో వీధుల పాలయినా పర్వాలేదు కానీ వంశమర్యాద దక్కితే చాలేమో! ఆయన ఒక కూతురికి పెళ్ళి సంబంధం తప్పిపోయిందని బాధపడుతున్నాడే కానీ మరో కూతురి జీవితం బండబారిపోయిన విషయం మరిచిపోయాడా? వీళ్ళందరికీ లోకమే ఆదర్శం కానీ మంచిని మంచిగా చూసే స్వభావం వీళ్ళకు ఎందుకు కలగడం లేదు ?

లోకాన్ని గురించి అనుకుంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కాదు. బ్రాహ్మణ యువతిగా

హోటల్ నడుపుతూ ఈ సమాజం దృష్టిలో తానొక శీలం లేని వ్యక్తిగా కనిపించవచ్చు. కానీ ఆ మగవాడు పెళ్ళిచేసుకుంటున్నది తన చెల్లెల్ను కానీ తనను కాదుగదా! ఆడది అలుసని ఆమె వంశాన్ని ఆమె గతాన్నీ ఆమె తాగే నీళ్ళనూ పీల్చే గాలినీ అన్నింటినీ మగవాడు పరీక్షిస్తున్నాడు. అట్లే ఆడది కూడా చేస్తే వీళ్ళ తలరాతలు ఏమవుతాయి?

ప్రశ్నలతో సందేహాలతో ఆమె నరాలు వేడెక్కాయి. ఎరుపెక్కిన కంటిమీద రెప్ప వాలలేదు. తూర్పు తెల్లబడింది. ఆమె ఆలోచనలకు తెరపడింది. బైపాస్ రోడ్లో సీతాలక్ష్మి హోటల్ మూతబడింది.

ఋతువులన్నీ ఒకసారి సూర్య మండలాన్ని చుట్టి వచ్చాయి. రంగనాధ శర్మ మళ్ళీ పౌరోహిత్యం మొదలు పెట్టి సంవత్సరం గడిచినా గిరాకీలు బొత్తిగా రావడం లేదు. పౌరోహిత్యమయినా వ్యాపారమయినా ఆర్భాటం లేకుంటే జరిగే రోజులు కావివి. పాపం రంగనాధశర్మ పల్లెటూరి పురోహితుడాయె. వృద్ధాప్యం పండబారిందాయె. వాక్కులో గంభీరం లేకపోయినా రూపంలోగానీ వేషంలోగానీ వ్యవహారంలోగానీ హుందాతనం అసలే లేదాయె. ఇంటిలోనూ వొంటిలోనూ దైన్యం తొంగి చూస్తున్నప్పుడు ఆయనగారి పౌరోహిత్యాన్ని ఎవరైనా ఎందుకు కోరుకుంటారు?

శిశిర ఋతువు వెళ్ళిపోయి వసంతం వొస్తూ వుంది. పండుటాకులు రాలిపోయి చిగుళ్ళు పొటమరిస్తున్నాయి. రంగనాధశర్మ ఇప్పుడు పౌరోహిత్యం పూర్తిగా మానుకుని ఇంటిదగ్గరే ఉంటున్నాడు. ఎవరయినా వచ్చి అడిగితే మంచిరోజులూ శుభగడియాలూ తెలిపి వాళ్ళిచ్చే తాంబూలంలోని చిల్లర దక్షిణలతో కాలం గడుపుతున్నాడు. మీనాక్షమ్మ విస్తరాకులు కుట్టి అమ్ముతూవుంది. సీతాలక్ష్మి ఇంటి పట్టున సరిగా వుండడం లేదు. పద్మావతి ఆర్నెల్ల కిందట టైలర్ ఇస్మాయిల్‌తో లేచిపోయి జీవితంలో అన్నీ పోగొట్టుకొని మొన్ననే వచ్చి పుట్టింట్లో తలదాచుకుంది. చిన్న కూతురు ఇంటిపనులు చూసుకుంటూ వుంది. రంగనాధశర్మ కొడుకులిద్దరూ నానా తిరుగుళ్ళలో అలిసిపోయి బైపాస్ రోడ్డు పక్కన సైకిల్ షాపు కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఒక రోజు సాయంకాలం ఇంటికొచ్చిన వ్యక్తిని చూసి కళ్ళనిండా నీళ్ళు నింపుకుంది మీనాక్షమ్మ. సీతాలక్ష్మి హోటల్లో పనిచేసిన యేసుపాదమని అతణ్ణి రంగనాధశర్మకు పరిచయం చేసింది. యేసుపాదం రంగనాధ శర్మకు నమస్కారం చేసి గడిచిపోయిన మంచి దినాలను గురించి ప్రస్తావించి ఆ సంసారంలోని దైన్యాన్ని చూసి బాధపడ్డాడు. సీతాలక్ష్మి అప్పుడింట్లో లేదు. రేపు వస్తానని చెప్పి టౌన్లో స్నేహితురాలింటికి వెళ్ళింది.

యేసు పాదం తాను వచ్చిన పని తెలిపి రేపు శుభగడియలు ఎప్పుడో చెప్పమని తాంబూలంలో పది రూపాయల నోటు పెట్టి రంగనాధశర్మకిచ్చాడు. పది రూపాయల నోటు చూడక ఎన్నాళ్ళయిందోయేమో పాపం, రంగనాధశర్మ నీళ్ళు నములుతూ తీసుకొని కళ్ళకద్దుకొని పంచాంగం చూసి రేపు పది నుండి పదకొండు గంటల మధ్య దివ్యమయిన కాలమని చెప్పాడు. యేసుపాదం సంతోషంగా వెళ్ళిపోయాడు.

భూగోళం చీకట్లో నుంచి వెలుతురులోకి తిరిగింది. తెల్లవారి పది గంటలు కావొస్తూ వుంది. రంగనాధ శర్మ హాల్లో చాపమీద కూర్చొని భాగవతం చదువుకుంటున్నాడు. మీనాక్షమ్మ దొడ్లో తులసి చెట్టుకు పూజ చేస్తూ వుంది. పద్మావతి కుట్టు మిషన్‌మీద మెల్లగా పాత చొక్కాలు కుడుతూ వుంది. సైకిల్ షాపు సామాన్ల కోసం అప్పు ఇస్తానన్న వ్యక్తి చేతులు తిప్పినాడేమో నిరాశతో ఎండలో వచ్చి నులక మంచమ్మీద కొడుకులిద్దరూ చెరోపక్క దిగులుగా కూర్చున్నారు. చిన్నమ్మాయి విస్తర్లు కుట్టే ఈనెలు తయారు చేస్తూ వుంది.

పెద్దగా శబ్దం చేస్తూ ఇంటిముందుకొచ్చి ఆటో రిక్షా ఆగడంతో ఇంట్లో వున్న వాళ్ళందరూ బయటికొచ్చారు. పూల మాలలు మెడలో వేసుకొని ఆటోదిగి ఇంటి ముంగిట్లోకి వొస్తున్న సీతాలక్ష్మి యేసు పాదములను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఒక్కసారిగా అందరి ముఖాల్లోనూ పోయిన కళ చిగురించింది.

సాయంకాలం బైపాస్ రోడ్లో సీతాలక్ష్మి హోటల్ మామిడి తోరణాలతో మిలమిల లాడింది.

✱

## అందుకున్నాం

- ★ ప్రొస్టరియస్ కవిత - సౌభాగ్య
- ★ తోవ ఎక్కడ - సుంకిరెడ్డి నారాయణరెడ్డి కవితలు
- ★ స్వాతి చినుకులు - వేమూరి బలరామ్
- ★ రావిశాస్త్రి సాహిత్య దృక్పథం - కాత్యాయనీ విద్మహే, మార్క్యాయదయ్య
- ★ ఇక ఊరు నిద్ర పోదు - హనీఫ్
- ★ మూడో కన్ను - పొట్లపల్లి శ్రీనివాసరావు
- ★ రెక్క విప్పిన రివల్యూషన్ - ఏంజెల్‌లో కాట్రొచ్చీ అనువాదం - శ్రీశ్రీ
- ★ బంగారమ్మ కథ - రచన జాక్ బెల్డన్, అనువాదం - కృష్ణాబాయ్
- ★ బహువచనం (దళిత బహుజన కవిత్వం సంపాదకుడు : సుంకిరెడ్డి నారాయణరెడ్డి
- ★ సినారెగజళ్ళు - డా. సి. నారాయణ రెడ్డి
- ★ నిశ్శబ్ద రూపాలు - ఏ. వి. నరసింహారావు
- ★ నీలి పాప - ఎస్. ఎమ్. ప్రాణ్‌రావు
- ★ కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు - జనపాల శంకరయ్య
- ★ వ్యాస చిత్రాలు - అబ్బూరి ఛాయాదేవి
- ★ మరకత మణిమాల -